# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** ఒక దేశం ఒక ఎన్నికకి సంబంధించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈరోజు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనుంది.

**2.** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం రాజధాని అమరావతి నిర్మాణం వంటి పలు అంశాలపై చర్చిస్తోంది.

**3.** ఉచిత ఇసుక విధానం ద్వారా పారదర్శకంగా ఇసుకను సరఫరా చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**4.** కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు.

**4.** మహా కుంభమేళాకు సంబంధించి ప్రత్యేక రైళ్ల బుకింగ్‌లు రేపటి నుండి అందుబాటులో ఉంటాయని భారతీయ రైల్వే వెల్లడించింది.

==========================

ఒక దేశం ఒక ఎన్నికకి సంబంధించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈరోజు జాయింట్ పార్లమెంటరీ కమిటీ- జేపీసీకి పంపనుంది. 31 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న ఈ కమిటీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. వీరిలో భారతీయ జనతా పార్టీ నుంచి పీపీ చౌదరి, అనురాగ్ సింగ్ ఠాకూర్, పర్షోత్తంభాయ్ రూపాలా, కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రియాంక గాంధీ, మనీష్ తివారీ తదితరులు ఉన్నారు. అలాగే కమిటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం. రమేశ్ , మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాల శౌరి, అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి. ఎం.హరీశ్ బాలయోగిలకు స్థానం కల్పించారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరగుతున్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి. పాలనాపరమైన అనుమతులు, మంగళగిరి ఎయిమ్స్‌కు మరో 10 ఎకరాల భూమి కేటాయింపు, జలజీవన్ మిషన్‌లో కొత్త టెండర్లు వంటి అంశాలపై మంత్రి వర్గం చర్చిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో పలు అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయంలో అధునాతన సాంకేతికతతో నూతన వరి వంగడాలు, కొబ్బరి వంగడాలతో దిగుబడి పెంచాలని సూచించారు. ఉచిత ఇసుక విధానం ద్వారా పారదర్శకంగా ఇసుకను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఎరువుల సరఫరాలో కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుదర్శన్ రాజు హెచ్చరించారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలలో ఆయన నిన్న ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రాజు మాట్లాడుతూ, ఎరువుల కృత్రిమ కొరతపై వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, తనిఖీలు నిర్వహిస్తోందన్నారు. దుకాణాలదారులు ఎరువుల క్రయ, విక్రయాలను ఈ పోస్ మిషన్ లో నమోదు చేయాలని తెలుపుతూ,

వాయిస్... 30 సెకన్లు

---------------------------

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా గంగూరులో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారు. ఈడ్పుగల్లులో స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం సేకరణను పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ పర్యవేక్షణ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్దేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనల పర్యవేక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. "క్షేత్రస్థాయిలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్లు నోడల్ అధికారులుగా ప్రాజెక్టులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వివిధ యూనిట్లకు సంబంధించిన పెట్టుబడుల ప్రతిపాదనలకు జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉన్న జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఎగుమతుల కమిటీ ద్వారా అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

---------------------------

తిరుమలలో సాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జలవనరులశాఖ ఛీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈరోజు తిరుపతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్ట్యా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. కుంభమేళా జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి వెళ్లే యాత్రికుల కోసం ఈ ప్రత్యేక రైళ్లు ముంబై, పూణే, నాగ్‌పూర్ తదితర నగరాల నుండి నడుస్తాయని పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్ల బుకింగ్‌లు రేపటి నుండి అన్ని రైల్వే రిజర్వేషన్ కేంద్రాలతో పాటు, భారతీయ రైల్వే ఆహార, పర్యాటక సంస్థ– ఐఆర్‌సిటిసి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

--------------------------

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి రైజింగ్ ఇండియా –పిఎంశ్రీ పాఠశాలలు ఎంతగానో దోహదపడుతున్నాయి. రాష్ట్రంలో ఈ పథకం కింద తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో 23పాఠశాలలు ఎంపికైయ్యాయి. పిఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక సౌకర్యాలు,గ్రంథాలయాలు, సైన్స్ ప్రయోగశాలలు వంటివి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి తొండమనాడు ప్రాధమిక ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణయ్య మాట్లాడుతూ,

వాయిస్... 30 సెకన్లు

--------------------------

శ్రీకాకుళం జిల్లాలోని తీరప్రాంత పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన జిల్లా స్థాయి తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ దృష్ట్యా గజ ఈతగాళ్లను నియమించాలని, వాచ్ టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులను గుర్తించడం కోసం బయోమెట్రిక్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 పథకం క్రింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పిఎంఎవై పథకం అమలు పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిన్న కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకానికి అర్హులైన వారందరూ తమ సచివాలయం పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిఎంఎవై పథకానికి రేషన్‌కార్డు, పాన్‌కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం వంటి వివరాలు నమోదు చేయాలని తెలిపారు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

--------------------------

రబీ సీజన్ 2024-26కు గానూ మామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలు చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాతావరణ పంటల బీమా కింద తెలియజేసిన పంటలకు ఇప్పటికే గడువు ముగిసినప్పటికీ మామిడి పంటకు మాత్రం ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపింది. మార్గదర్శకాల ప్రకారం జిల్లాల్లో కనీసం 2వేల హెక్టార్లకు తక్కువకాకుండా మామిడి సాగులో ఉండాలని, ఐదు క్లస్టర్ల పరిధిలో 15 జిల్లాల్లో మామిడి సాగుకు పంటల బీమా వర్తింప చేయనున్నామని ప్రభుత్వం తెలిపింది.

======================